# నలుగురి కోసం

కార్తీకమాసం. పెళ్ళిళ్ళసమయం. మాదగ్గర బంధువు ఇంట్లో పెళ్లి భోజనానికి వెళ్లాలి. వెళ్లకపోతే బాగుండదు. ఇంట్లో టి. వి. నడుస్తోంది. మనస్సులో పీకుతున్నా ముస్తాబు చేసుకున్నాను సావిట్లో శవాన్ని పెట్టుకుని ముస్తాబై విందుభోజనానికి వెడుతూంటే ఏదో చెయ్యరాని నేరం చేసినట్లే అనిపించింది. టి. వి. లో ఇందిరాగాంధీ శవం నాలుగడుగుల దూరంలో స్పష్టంగా కనిపిస్తోంది. రకరకాల జనం ఎంతో దూరం నుంచి శ్రమపడి ఇందిరాప్రియదర్శిని భౌతికదేహాన్ని దర్శించటానికి వస్తున్నారు. చుట్టూ ప్రదక్షిణచేసి వెడుతున్నారు. మేము టి. వి. కట్టేసి తలుపులికి తాళాలు వేసుకుని బయలుదేరాం విందుభోజనానికి.

భోజనం చేస్తున్నంతసేపూ పెళ్లివారూ, అతిధులూ, అందరూ ఇందిరాగాంధీ దుర్మరణం గురించీ, ఆవిడ శవ ప్రదర్శనగురించే మాట్లాడుతున్నారు. 'పట్టుచీర కట్టుకుని నగలు పెట్టుకోబుద్ధి కాలేదంటే నమ్మండి' అని ఒకరు, 'ప్రాణం చివుక్కుమంది శవాన్ని వదిలేసి వస్తూంటే' అని మరొకరూ, ఆడవాళ్ళంతా తలోరకంగా తమ 'గిల్టీ కాన్షన్స్'ని వ్యక్తం చేశారు.

ఆరోజు బాధపడని వాళ్లు లేరంటే అతిశయోక్తి కాదు. ఇందిరమ్మ పోతే ఇంట్లోమనిషి పోయినట్లు బాధపడ్డారు అందరూ. కాని ఆ మర్నాటి నుంచీ మా వ్యాఖ్యానాల్లో క్రమంగా మార్పువచ్చింది. ఆవిడ పోయిందన్న విచారం తగ్గిందనికాదు. 'సారంగీ వాదన్' అని కనిపించగానే సణుక్కోవడం మొదలుపెట్టాం. ఈ రేడియోవాళ్లకీ, టి. వి. వాళ్లకీ ఇంత కన్న సంగీత విద్వాంసులు దొరకలేదా అని విసుక్కున్నాం. మూడు రోజులుపోతే వాళ్ళకే విసుగొచ్చి ఏదన్నా మంచి సంగీతం వినిపిస్తారేమోనని ఆశపడ్డాం. కాని ఒకరికంటె మించి మరొకర్ని ఏడుస్తూపాడగలిగే వాళ్లనందరినీ పోగుచేసి మనల్ని ఏడిపించారు. కర్నాటక సంగీతంలో అంత ఏడుపు లేదేమో, అంతా హిందుస్థానీ ఏడుపే వినిపించింది. ఒక వేళ పేరున్న సంగీత విద్వాంసులచేత పాడిస్తే కొంపతీసి జనం ఆనందిస్తారేమో నని (ఇది ఆనందించే సమయం, సందర్భం కాదుకదా) అనుకుని ఊరూపేరూ లేని వాళ్లని పిలిపించి ఏడిపించారు—పన్నెండురోజుల పాటు ప్రభుత్వంతోబాటు దేశప్రజలంతా విచారంగా ఉండాలని. ఇంకా నయం. కర్ఫ్యూ విధించినట్లు నవ్వుని నిషేధించలేదు. టి.వి. న్యూస్‌రీడర్లనీ, ఎనౌన్సర్లనీ చూస్తే జాలేసింది. విచారంగా మొహం పెట్టకపోతే ఉద్యోగాలు పోతాయేమోనన్నంతగా బిగదీసుకుపోయారు. పదమూడో రోజున పాపం వాళ్ల మొహాల్లో వెన్నెలలు విరిశాయి. 'హమ్మయ్య' అన్నట్లు చిరునవ్వులు ఆ మొహాల మీద

మన ప్రియతమ నేతని కోల్పోయినందుకు దేశమంతా పన్నెండు రోజులపాటు సంతాపాన్ని పాటించాలనుకోవడం, మనదేశంలో రేడియో, టి.వి. ప్రభుత్వ సాధనాలు కాబట్టి ఆ సంతాపాన్ని తు.చ. తప్పకుండా పాటించడం ఎంత ప్రియతమనేత కోసమయినా దుర్భరమే అనిపించింది—పిన్నలకీ పెద్దలకీ కూడా. ఏదైనా కట్టడిలో ఉన్నప్పుడు

దాన్నుంచి బయట పడాలని కాంక్షించడం మానవ నైజం. ఇదంతా జాతీయ స్థాయిలో జరిగిన సంగతి.

మా పెద్దనాన్నగారు పోయినప్పుడు దగ్గరవాళ్లూ, దూరపువాళ్లూ, బంధువులంతా చేరారు. చిన్నవాళ్లూ, పెద్దవాళ్లూ, ఇల్లంతా పెళ్లి వారిల్లులా గందరగోళంగా ఉంది.

మా పెద్దనాన్నగారి వయస్సు అరవై ఏళ్లకి పైగా ఉంటుంది. టైఫాయిడ్ వచ్చి పోయారు. ఆయనకి భార్యలేదు. మా పెద్దనాన్నగారి కొడుకు కర్మచేస్తున్నాడు. మా అమ్మ, నాన్నగారూ వంటింట్లోనూ, బయటా అన్ని పనులూ పురమాయిస్తూ పర్యవేక్షణ చేస్తున్నారు. ఇంట్లో వంటవాళ్లూ, నౌకర్లూ చాకర్లూ ఉన్నారు. అంచేత వచ్చిన బంధువులికి ఎవరికీ చెయ్యవలసిన పనులెక్కువగాలేవు. వచ్చిన బంధువుల్లో కొంత మంది పల్లెటూళ్ల నుంచి వచ్చారు—వ్యవసాయం, కరిణీకం పనులు వాయిదా వేసుకుని. కొంత మంది పట్టణాల నుంచీ వచ్చారు ఉద్యోగాలకు సెలవు పెట్టుకుని. పనీ పాటాలేకుండా పన్నెండురోజుల దాకా తిని కూర్చోవాలంటే కష్టమే. తలోగదిలో చాపపరుచుకుని నిద్రపోయే వాళ్లు కొందరు, చదరంగం ఆడుకునే వాళ్లు కొందరు, పేకాట ఆడేవాళ్లు మరికొందరు ఆడపిల్లల్లో గచ్చకాయలాడే వాళ్లు కొందరు, చింతపిక్కలాడేవాళ్లు కొందరు, కూర్చుని కబుర్లాడుకునే వాళ్ళు కొందరు.

వచ్చిన వాళ్లని ఏమీ అనలేక మా నాన్నగారు నన్ను, మా అన్నయ్య, అక్కయ్య, వదిన, చెల్లెల్నే చూసినప్పుడల్లా ఛెడామడా చివాట్లు పెట్టేవారు. 'ఓ పక్కన కర్మ జరుగుతోంది. మరోవైపు నుంచి ఊళ్లో పరామర్శ కొచ్చేవాళ్లూ, వెళ్లేవాళ్లూ—బుద్ధుందా మీకు

పేకాడటానికీ, గచ్చకాయలాడటానికీ' అని. ఎవరూ పట్టించుకునే వారు కాదు.

ఓరోజు రాత్రి ఎంతకీ నిద్రపట్టలేదు మాకు. కొంతమంది సినిమాకి వెళ్లిపోయారు. డాబామీద పడుకున్నాం కొందరం. నాకు హఠాత్తుగా ఒకటి తట్టింది. గొప్పగొప్పవాళ్లు పోయినప్పుడు భజనగీతాలు రేడియోలో ప్రసారం చేస్తూ ఉంటారు కదా. ఆ సంగతి గుర్తుకొచ్చి మా అక్కని 'అక్కా! 'భజగోవిందం' పాడవే, వినాలని ఉంది' అన్నాను. మా పెద్ద నాన్నకి కూడా ఆ గీతం చాలా ఇష్టం. అక్కకి కూడా నాలాగే ఏమీ తోచడం లేదేమో, వెంటనే ఒప్పుకుని, లేచి కూర్చుని తాళంవేస్తూ గొంతెత్తి పాడటం మొదలుపెట్టింది. నిశ్శబ్దంగా ఉందేమో నిశీథిలో ఆ గీతం వాతావరణమంతా వ్యాపించినట్లనిపించింది. రెండు చరణాలు పాడిందో లేదో మా అమ్మ డాబామీదికొచ్చి ఒగుర్చుకుంటూ 'ఏమిటే ఆ పాటలు, ఆపండి, మీకేమైనా మతిపోయిందా? నలుగురూ వింటే ఏమన్నా అనుకుంటారని కూడా లేదు' అంది. 'భజన గీతమే కదా అమ్మా' అన్నాను. 'నోర్మూయ్' అనేసి విసవిసా వెళ్లిపోయింది. ఇలాంటి వాళ్లే మళ్లీ 'పెద్దవాళ్ల చావు పెళ్లితో సమానం' అంటారు. మొగపిల్లలంతా సినిమాకి చెక్కేస్తే పరవాలేదు కాని, మేము భజనలు ఆలపిస్తే తప్పొచ్చింది. నలుగురూ ఏమన్నా అనుకుంటారుట! గొణుక్కుంటూ పడుకున్నాం

పోనీ, మా పెద్దనాన్నగారంటే ముసలాయన, సహజమైన మరణం అనుకోవచ్చు. మా మామయ్య నడివయస్సు కూడా రాకుండా హఠాత్తుగా గుండె ఆగి చనిపోయాడు. అందరికీ అది విద్యుద్ఘాతంలా తగిలింది. మా అత్తయ్య చిన్నది, చక్కనిది. ముచ్చటయిన ముగ్గురు

చిన్నపిల్లలు ఆవిడ దుఃఖం చూస్తే అందరికీ కడుపు తరుక్కుపోయింది. పైగా దీపావళి వారం రోజులుందనగా పోయాడు.

పొద్దుటినుంచి రాత్రి వరకూ ఊళ్లోవాళ్లో, పరాయి ఊళ్లనుంచి వచ్చిన వాళ్లో, ఎవళ్లో ఒకళ్లు రావటం, వాళ్లని చూడగానే మా అత్తయ్య గొల్లుమని ఏడవటం, వచ్చిన వాళ్లూ ఇంట్లోవాళ్ళూ కళ్లు తుడుచుకోవడం, ముక్కు చీదుకోవడం, వాళ్ల వాళ్ల ఇళ్లలో అంతవరకూ అకస్మాత్తుగా సంభవించిన చావుల గురించి ముచ్చటించడం, అత్తయ్యకి భగవంతుడు చేసిన అన్యాయం గురించీ, పిల్లల భవిష్యత్తు గురించీ పరామర్శించడం, అత్తయ్య కుళ్లికుళ్లి ఏడుస్తూంటే వచ్చినవాళ్ళు వెళ్లడం-ఇలా గడుస్తున్నాయి రోజులు. పెద్దవాళ్ల ఏడుపులతో పిల్లలు కూడా బిక్కచచ్చిపోయి తల్లుల వెనకాల నక్కుతున్నారు.

అయిదారు రోజులయేసరికి పరామర్శకొచ్చే వాళ్ల సంఖ్య పలచబడింది. దగ్గర బంధువులూ దగ్గర స్నేహితులూ, ఇరుగు పొరుగు వాళ్ళూ రావడం అయింది. ఇక దూరాలనుంచి అడపా తడపా ఎప్పుడో ఉన్నట్టుండి వస్తున్నారు.

పిల్లలికి కాస్త తెరిపి వచ్చింది. ఒక్కొక్కరే తల్లి ఒడిలోకి చేరి పేచీలు మొదలు పెట్టారు—ఆకలేస్తోంది, ఏమన్నా పెట్టమని ఒకడూ, టపాకాయలు కాల్చుకుంటానని ఒకడూ, తన బంతి ఎక్కడోపోయింది, బంతి కావాలి అని ఒకడూ—ఈ రకంగా పేచీలు మొదలయ్యాయి. టపాకాయలు ఇంట్లో కాలిస్తే బాగుండదని ఇరుగుపొరుగు స్నేహితుల ఇళ్లకి పట్టుకెళ్లి కాల్చుకోండని పంపేశారు కాల్చుకుతినే పిల్లల్ని. ఆనాడు ఊరంతా దీపాలతో నిండితే మా ఇంట్లో మాత్రం అమావాస్యే మిగిలింది.

మా అత్తయ్య పడగ్గది పక్కన ఉన్న నడవలో ఒక మూల చాప వేసుకుని అక్కడే కూర్చునేది రోజంతా. బలవంతం మీద భోజనం చేసి కాసేపు నడుం వాల్చేది. తక్కిన ఆడవాళ్లు భోజనాలూ పనులూ అయ్యాక అత్తయ్యచుట్టూచేరి ఆ కబురూ ఈ కబురూ చెప్పుకుని అంతా తలో కొంగూ పరుచుకుని పడుకునేవారు. మధ్యలో ఎవరన్నా పరామర్శకొచ్చారని తెలిస్తే లేచి కూర్చుని కళ్లుతుడుచుకునేవారు. అత్తయ్య గొల్లుమని నోట్లో గుడ్డ కుక్కుకునేది. పిల్లలంతా వీధి అరుగులమీదో, పెరట్లోనో ఆడుకుంటూ ఉండేవారు. ఒక్క గోపిగాడు-అంటే మా అత్తయ్య చిన్నకొడుకు-నాలుగేళ్లవాడు మాత్రం తల్లిని ఎక్కువగా వదిలేవాడు కాదు. వీధిలో ఆడుకుంటున్న పిల్లల్ని కాసేపు చూసొచ్చి మళ్లీ లోపలికి తల్లిదగ్గరికి పరుగెత్తుకొచ్చి తల్లిచుట్టూ తారట్లాడేవాడు. ఎవరైనా పరామర్శకు రావడం, తల్లి గొల్లుమనడం, వాళ్లు కాసేపు మాట్లాడి వెళ్లాక మళ్లీ చాపమీద పడుకోవడం, ఇంట్లోవాళ్లతో కబుర్లు చెప్పుకోవడం—అన్నీ నిశ్శబ్దంగా గమనిస్తూ ఉండేవాడు.

ఆ రోజు పదకొండోరోజు. మధ్యాహ్నం భోజనాలయ్యాక ఆడవాళ్ళంతా నడవలో అత్తయ్యచాపచుట్టూ కూర్చుని వీళ్ల సంసారాల గురించీ, వాళ్ల సంసారాల గురించీ ముచ్చట్లలో పడ్డారు. అత్తయ్యకూడా కబుర్లు చెబుతోంది మధ్యమధ్య. గోపిగాడు అత్తయ్య ఒళ్లో కూర్చుని ఆ కబుర్లు వింటూంటే 'ఒరే గోపిగా, ఏం వింటావురా ఆ పెద్ద కబుర్లు, బయటికి పోయి ఆడుకో' అంది పిన్ని. అత్తయ్యకూడా అదే చెప్పి వాణ్ణి బయటికి పంపేసింది. మళ్లీ కబుర్లలో పడ్డారు అందరూ.

గోపిగాడు అంతలోనే గబగబా పరుగెత్తుకుంటూ వచ్చి 'అమ్మా, అమ్మా, ఇంక నువ్వు ఏడుపు మొదలుపెట్టు, వాళ్లొచ్చేస్తున్నారు' అన్నాడు.

అత్తయ్య నిర్ఘాంతపోయింది. మేమూ తెల్లబోయి చూశాం. గేటు తెరుచుకుని ఎవరో స్నేహితులు పరామర్శ చేయడానికి వస్తున్నారు.

మా బామ్మ అందరికంటే ముందుగా తేరుకొని 'ఛడవకానా, అవతలికి పో' అంటూ బోసినవ్వు ఆపుకుంటూ వాడి పిర్రమీద ముద్దుగా చరచింది. మేమంతా ఒకరిమొహం ఒకరు చూసుకున్నాం చిరునవ్వు ఆపుకుంటూ. మా అత్తయ్య తలవంచేసుకొని, కొంగు మూతికి అడ్డంగా పెట్టుకుంది-సిగ్గుపడి చిరునవ్వు దాచుకోవడానికో, లేక ఇంతసేపూ తను ఏడవకుండా మామూలుగా కబుర్లలో పడిపోయినందుకు బాధపడటం వల్లనో, తెలియలేదు.

(ఉదయం దినపత్రిక, ప్రారంభ సంచిక,
29, డిసెంబర్, 1984)